సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు
జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలతో బాధపడుతున్నవారు ఆస్పత్రులలో చేరుతున్నారు.
- 8లో ▸



వెక్కిరిస్తున్న ఖాళీలు
జిల్లాలో పశువైద్యాధికారులు, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పశువులకు సరైన వైద్యం అందడం లేదు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /22.3
వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో 71 శాతం వరినాట్లు పూర్తి

నాగిరెడ్డిపేట: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 71 శాతం వరినాట్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాల్తుమ్మెద రైతు వేదికలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 3.12 లక్షల ఎకరాలలో వరి పంట వేస్తారని అంచనా వేయగా.. ఇప్పటి వరకు 2 లక్షల ఎకరాలలో నాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు అంచనాల మేరకు పంటలు సాగవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో ఏవో విజయశేఖర్ పాల్గొన్నారు.

'మొక్కలను నాటి సంరక్షించాలి'



దోమకొండ: 'స్వచ్ఛదనం పచ్చదనం'లో భాగంగా ప్రతి బస్టాండ్‌లో మొక్కలను నాటి సంరక్షించాలని ఆర్టీసీ నిజామాబాద్ ఆర్‌ఎం జానీరెడ్డి సూచించారు. గురువారం దోమకొండ బస్టాండ్ ఆవరణలో ఆయన మొక్కలను నాటారు. ఇటీవల బస్టాండ్‌లో జరిగిన మరమ్మతు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నుంచి దోమకొండకు నిత్యం షటిల్ బస్సు నడపాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్ ఆయనకు వినతిపత్రం అందించారు. వనమహోత్సవంలో కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర, అసిస్టెంట్ మేనేజర్ లింగమూర్తి, సిబ్బంది ముత్యం, బాలయ్య, నారగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తర్వాత 'మధ్యాహ్నం' మొదలు



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట: తాండూర్ హైస్కూల్‌లో ఎట్టకేలకు మధ్యాహ్న భోజన పథకం మళ్లీ ప్రారంభమైంది. ఈ పాఠశాలలో నాలుగేళ్లుగా మధ్యాహ్న భోజన పథకం అమలుకావడం లేదన్న అంశంపై ఈనెల 7న 'సాక్షి'లో 'నాలుగేళ్లుగా మధ్యాహ్న భోజనం బంద్' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. బుధవారం గ్రామస్తులతో సమావేశమయ్యారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్రామానికి చెందిన వంగరి పద్మ, ఆసం లావణ్య ముందుకు వచ్చారని హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం భోజనం వండి వడ్డించారని పేర్కొన్నారు.

సర్వీస్ రోడ్డు.. నిర్మించేదెప్పుడు?

జాతీయ రహదారులను అభివృద్ధి చేసే క్రమంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడం సమస్యగా మారింది. 44 వ నంబరు జాతీయ రహదారిని విస్తరించిన సమయంలో అప్పటి అధికారులు నిర్లక్ష్యం చేయడం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సర్వీస్ రోడ్లు లేకపోవడంతో ఆయా గ్రామాలకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు.

- దశాబ్దాలు గడుస్తున్నా ముందుకు సాగని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



అధ్వానంగా ఉన్న జాతీయ రహదారి పైనుంచి రామారెడ్డి రోడ్డు వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బెంగళూరు నుంచి నాగ్‌పూర్ వరకు కొనసాగే 44వ నంబరు జాతీయ రహదారి కామారెడ్డి జిల్లాలో బస్వాపూర్ వద్ద మొదలై దగ్గి వద్ద ముగుస్తుంది. ఈ రహదారిపై పలు చోట్ల సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భిక్కనూరు, సదాశివనగర్, కామారెడ్డి తదితర మండలాల్లో జాతీయ రహదారి వెంట సర్వీస్ రోడ్లు, వంతెనలు నిర్మించాల్సి ఉంది. ప్రధానంగా సర్వీస్ రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు.. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందించినా ప్రయోజనం లేదు. రహదారి విస్తరించి పుష్కర కాలం గడిచినా సమస్య అపరిష్కృతంగానే ఉంది.

ఇల్చిపూర్ రోడ్డు వద్ద..

జాతీయ రహదారి నుంచి అటు ఇల్చిపూర్, ఇటు కామారెడ్డి పట్టణానికి వెళ్లడానికి సర్వీస్ రోడ్డుకు స్థలం ఇచ్చి మట్టిరోడ్డుతో సరిపెట్టారు. హైవై పై సర్వీస్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తే ఇల్చిపూర్‌కు, కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి వెళ్లడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ సర్వీస్ రోడ్డు అభివృద్ధి చేస్తే అశోక్‌నగర్ కాలనీ వాసులకు రైలు గేటు దాటే అవసరం కూడా ఉండదు. అక్కడి సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సిద్ధరామేశ్వరాలయానికి సర్వీస్‌రోడ్డు లేక..

దక్షిణకాశీగా పేరొందిన భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరాలయానికి నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలతో పాటు హైదరాబాద్, మెదక్ ప్రాంతాల నుంచి నిత్యం ఎంతో మంది భక్తులు వస్తుంటారు. అయితే సిద్ధరామేశ్వరాలయానికి వెళ్లే చోట సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడం భక్తులకు ఇబ్బందికరంగా మారింది. సిద్ధరామేశ్వరాలయానికి వెళ్లాలంటే భిక్కనూరు మండల కేంద్రంలోపలికి వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే ఆలయానికి వెళ్లడంతోపాటు సమీపంలోని గ్రామాలకు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుంది.

బీటీఎస్ చౌరస్తా వద్ద వంతెన కష్టాలు

భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తా వద్ద చిన్న వంతెన నిర్మించారు. దాని గుండా కార్లు, బైకులు మాత్రమే వెళతాయి. ఈ చౌరస్తా నుంచి దోమకొండ, బీబీపేట మీదుగా సిద్దిపేటకు నిత్యం బస్సులు నడుస్తుంటాయి. బస్సులు కామారెడ్డి వైపు నుంచి దోమకొండకు సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్తున్నాయి. అయితే దోమకొండ వైపు నుంచి కామారెడ్డికి వెళ్లాలంటే హైవే ఎక్కిన తర్వాత సమీపంలో ఉన్న యూటర్న్ మూసి వేయడంతో భిక్కనూరు సమీపంలోని టోల్‌గేట్ వద్దకు వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. అంతదూరం వెళ్లి తిప్పుకుని రావడానికి ఐదారు కిలోమీటర్లు వృథాగా తిరగాల్సి వస్తోంది. ఇక్కడే భారీ వాహనాల కోసం వంతెన నిర్మించి ఉంటే ఇబ్బంది ఉండేది కాదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. బీటీఎస్ చౌరస్తా వద్ద పెద్ద వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన సర్వీస్ రోడ్డు

ఇబ్బందిగా ఉంది



జాతీయ రహదారినుంచి సిద్ధరామేశ్వర ఆలయానికి సర్వీస్ రోడ్డు లేదు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. హైవేపైనుంచి వచ్చేవారు భిక్కనూరు మండలకేంద్రం లోపలికి వచ్చి వెళ్లాల్సి వస్తోంది. సర్వీస్ రోడ్డు వేస్తే సౌకర్యంగా ఉంటుంది.

– పుర్ర బాల్‌రెడ్డి, భిక్కనూరు

ఉప్పల్‌వాయి వెళ్లే రోడ్డు వద్ద..

44వ నంబరు జాతీయ రహదారి నుంచి సదాశివనగర్ మండలం సత్యపీరీల దర్గా సమీపం నుంచి ఉప్పల్‌వాయి, రామారెడ్డి మీదుగా మాచారెడ్డి వెళ్లే రహదారికి సర్వీస్ రోడ్డు పాయింట్ ఇచ్చినా పనులు పూర్తి చేయలేదు. నిజామాబాద్ వైపు నుంచి, అలాగే సదాశివనగర్ వైపు నుంచి వచ్చి ఉప్పల్‌వాయి వైపు వెళ్లడానికి వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరువైపులా సర్వీస్ రోడ్డుకు స్థలం వదిలి కంకర రోడ్డు వేసి వదిలేశారు. ఈ రోడ్డు గుండా ప్రముఖ ఆలయాల్లో ఒకటైన కాలభైరవ స్వామి ఆలయానికి ఎంతో మంది వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. అయితే రోడ్డు అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరువైపులా సర్వీస్‌రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. ఇదే రోడ్డులో పారాబాయిల్డ్ రైస్‌మిల్లులు, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. సర్వీస్ రోడ్డు సరిగా లేక లారీలు ఇతర ప్రాంతాల నుంచి వెళ్లాల్సి వస్తోంది. దగ్గి వద్ద కూడా ఒక వైపు సర్వీస్ రోడ్డును నిర్మించాల్సి ఉంది.

సర్వీస్ రోడ్డు వేయాలి



మా ఇంటి దేవుడు సిద్ధరామేశ్వరుడు. ఆయన గుడికి నెలకోసారి వస్తుంటాం. సర్వీస్ రోడ్డు లేకపోవడంతో భిక్కనూరు మండలకేంద్రం లోపలినుంచి వెళ్లాల్సి వస్తోంది. హైవే పైనుంచి సర్వీస్ రోడ్డు వేస్తే బాగుంటుంది.

– రాజంపేట శ్రీనివాస్, నిజామాబాద్

మంజీరలో ఇసుక దందాపై విచారణ



మంజీర నదిలో పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మంజీర నదిలో ఇసుక తవ్వకాలపై కోర్టు ఆదేశాలతో జిల్లా యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచనలతో రెవెన్యూ, మైనింగ్, పోలీస్, నీటిపారుదల శాఖ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, టీజీఎండీసీ అధికారుల బృందం గురువారం మంజీర నదీ తీర ప్రాంతంలో గురువారం సర్వే నిర్వహించింది. బీర్కూర్, బిచ్కుంద మండలాల పరిధిలోని బీర్కూర్, ఖండే బల్లూర్, గుండెనెమ్లి గ్రామాల పరిధిలోని మంజీర నదిని పరిశీలించారు. అక్కడ జరిగిన తవ్వకాలకు సంబంధించి వివరాలు సేకరించారు. ఎక్కువ మొత్తంలో ఇసుక తరలించిన ఆరోపణలపై విచారణకు వెళ్లారు. బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు మంజీరలో ఇసుక రీచ్‌లను పరిశీలించారు.

నీటి పారుదల శాఖ డీఈ, మైనింగ్ ఏడీ, సర్వే ల్యాండ్స్ ఏడీ, డీఎస్పీ, టీజీఎండీసీ పీవో, స్థానిక తహసీల్దార్, ఎస్సై తదితరులు బృందంలో ఉన్నారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలతో మంజీర నదిలో నీరు ప్రవహిస్తుండడంతో ఎంత మేర ఇసుక తవ్వారన్న దానిపై ఎలాంటి ఆధారాలు సేకరించలేకపోయినట్టు తెలిసింది. మంజీర నదిలో ఇసుక తవ్వకాల కోసం గతంలో ఆరు రీచ్‌లకు అనుమతులు ఇచ్చారు. రాజకీయ పలుకుబడితో వాటిని కొనసాగిస్తూ వచ్చారు. ప్రభుత్వం మారడంతో ఇసుక వివాదం మొదలైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇసుక రీచ్‌లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారంలో ముఖ్య నేతల మధ్య విభేదాలు వచ్చినట్టు ప్రచారం జరిగింది. గత నెలలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఇసుక అక్రమ మైనింగ్‌పై టీజీఎండీసీకి ఫిర్యాదు చేయగా.. విచారణ జరిపిన అధికారులు ఐదుగురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. అలాగే కాంట్రాక్టర్లపై చర్యల్లో భాగంగా ఆయా సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టారు.

న్యాయవాది ఫిర్యాదుతో..

మంజీర నదిలో అనుమతులకు సంబంధించి గడువు ముగిసినా రోజూ రూ.30 లక్షల విలువైన ఇసుక తవ్వకాలు నడుస్తున్నాయని ప్రకాశ్ అనే న్యాయవాది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. దీంతో చీఫ్ జస్టిస్ లోక్ అరాధే, జస్టిస్ జే.శ్రీనివాస్‌రావ్ ధర్మాసనం ఈనెల 5న విచారణ చేపట్టింది. వాదనల అనంతరం గనులు, భూగర్భ, రెవెన్యూ, రవాణ, హోంశాఖల ముఖ్య కార్యదర్శులు, టీజీఎండీసీ, కలెక్టర్‌తో పాటు తహసీల్దార్‌కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసందే. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపిన అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా కలెక్టర్ ఉన్నతాధికారులకు, హైకోర్టుకు నివేదిక అందించనున్నట్లు తెలుస్తోంది.

అర్హులందరి పంట రుణాలు మాఫీ చేయాలి



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- సీఎం మాట నిలబెట్టుకోవాలి
- రచ్చబండలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి డిమాండ్

కామారెడ్డి రూరల్: అర్హులైన ప్రతి రైతు పంట రుణాన్ని మాఫీ చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 1.50 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేశామని చెబుతోందని, కానీ చాలా మంది రుణాలు మాఫీ కాలేదని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే విషయం అర్థం అవుతుందన్నారు. బీజేపీ ఏర్పాటు చేసిన 88861 00097 నంబర్‌కు రుణమాఫీ కానీ రైతులు ఫోన్ చేసి వివరాలు చెబితే సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీని నిలబెట్టుకోవాలన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈనెల 15వ తేదీలోగా రూ. 2 లక్షలలోపు పంట రుణాలను ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార డిమాండ్ చేశారు. సాంకేతిక కారణాల సాకుతో రైతులకు అన్యాయం చేయాలని చూడొద్దన్నారు. ఈ సందర్భంగా రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాలు తీసుకుని సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, నాయకులు రాజు పాటిల్, శ్రీధర్, అనిల్, మహిపాల్, పోషయ్య, తిరుపతి, సుమన్, ప్రవీణ్, ప్రశాంత్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పోచారం



ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న పోచారం

బాన్సువాడ: ప్రతి ఒక్కరు మొక్కలను నాటి, సంరక్షించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి బాన్సువాడ ఎల్లయ్య చెరువు కట్టపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

అనంతరం మోటార్ వెహికిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్రైవర్ల కోసం ఎల్లయ్య చెరువు కట్టపై స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజు, నాయకులు ఎజాస్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఖలేక్, దాసరి శ్రీనివాస్, జహీర్, రయీస్, దేవికృష్ణప్రసాద్, గుడాల నగేష్, వాహబ్, మన్నన్, సాయిలు, నార్ల సురేశ్, హకీం, నందు, హైమద్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ సందర్శన

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టును గురువారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. నీటిపారుదలశాఖ ఈఈ సోలోమాన్‌తో మాట్లాడి నీటి నిల్వ సమాచారం తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 3.9 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు.

'ఓటరు జాబితాపై అవగాహన పెంచుకోండి'



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: ఓటరు జాబితాపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ ఓటరు జాబితా తయారీపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఈ–పంచాయతీ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో రూపొందించిన ఓటరు జాబితా ఆధారంగా జీపీ ఓటరు జాబితా– 2024 తయారు చేయాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమం ద్వారా నాటిన మొక్కల వివరాలను అటవీశాఖ వెబ్‌సైట్ మేరీ లైఫ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించండి


ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. రెవెన్యూ శాఖ మంత్రి రోజూ ఎల్‌ఆర్‌ఎస్ పరిష్కారాలపై సమీక్షిస్తున్నారన్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఇరిగేషన్ భూములు, రోడ్డు మార్కింగ్‌లో పోయిన భూములు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భూములు, పట్టా కాని భూములు లేకుండా చూసుకోవాలన్నారు. డీటీ, ఎంపీవో, ఆర్‌ఐలు వివాదాలు లేని భూముల దరఖాస్తులను వెంటనే పరిశీలించి, జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పరిష్కారానికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, డీఆర్‌డీవో సురేందర్, ఆర్డీవోలు శ్రీనివాస్, సురేందర్, నాగరాజు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

గుర్తుండిపోయేలా ఏర్పాట్లు చేయండి

స్వాతంత్ర్య దినోత్సవాలు ఎప్పటికీ గుర్తుండి పోయేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పెరేడ్ గ్రౌండ్, భద్రతా ఏర్పాట్లు, స్టేజీ, సౌండ్ సిస్టం, సీటింగ్, టెంట్లు, తాగునీరు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన తదితర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్పీ నరసింహారెడ్డి, సీపీవో రాజారాం, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు షురూ

- జలాల్‌పూర్ నుంచి కామారెడ్డి వరకు పైప్‌లైన్
- అసెంబ్లీ ఎన్నికలకు ముందే రూ. 195 కోట్లు మంజూరు
- ఇటీవల పూర్తయిన టెండర్ల ప్రక్రియ



పైప్‌లైన్ వేయడం కోసం తెచ్చిన పైపులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కామారెడ్డికి నీటిని అందిస్తున్న పైపులైన్లకు అదనంగా రూ. 195 కోట్లతో చేపట్టిన కొత్త పైపులైన్ పనులు మొదలయ్యాయి. పట్టణానికి తాగునీరందించే పైప్‌లైన్ మాటిమాటికీ చెడిపోతోందని అప్పటి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇచ్చిన వినతి మేరకు అప్పటి సీఎం కేసీఆర్ కొత్త పైప్‌లైన్ కోసం ఎస్‌డీఎఫ్ నుంచి రూ.195 కోట్లు మంజూరు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ నిధులు మంజూరయ్యాయి. అయితే నిధులు మంజూరైనా టెండర్ల ప్రక్రియ చేపట్టలేకపోయారు. బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోవడం, కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొంతకాలానికే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆ ఫైల్ పక్కకు వెళ్లిపోయింది. పైప్‌లైన్లు తరచూ పగిలిపోవడంతో వేసవిలో తాగునీటి సమస్య పెరిగింది. ఈ నేపథ్యంలో స్పందించిన ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.195 కోట్ల పైపులైన్ పనులకు సంబంధించి టెండర్లు నిర్వహించింది. అగ్రిమెంట్ కూడా పూర్తవడంతో కాంట్రాక్టు సంస్థ పనులు మొదలుపెట్టింది. ఇప్పటికే పైపులను డంప్ చేయడంతో పాటు పైపులైన్ వేసే పనులు కూడా చేపట్టారు. జలాల్‌పూర్ వద్ద నీటిని పంపింగ్ చేసే ప్రదేశం నుంచి 44 వ నంబరు జాతీయ రహదారి మీదుగా సదాశివనగర్ మండలంలోని మల్లన్నగుట్ట వరకు, అక్కడి నుంచి కామారెడ్డి పట్టణంలోని డిగ్రీ కాలేజీ వద్దనున్న ఫిల్టర్ బెడ్ వరకు పైప్‌లైన్ వేయనున్నారు. ఈ పైప్‌లైన్ పనులు పూర్తయితే కామారెడ్డి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు.

వన మహోత్సవం పరిశీలన



వన మహోత్సవాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

తాడ్వాయి: నాటిన మొక్కలను సంరక్షించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజీవాడి శివారులో గల కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన దారి పక్కన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. నాటిన మొక్కలను పరిశీలించారు. గతంలో నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణను ఆపాలి



కామారెడ్డి రూరల్ : వర్గీకరణ ముసుగులో అమలు చేస్తున్న క్రిమిలేయర్‌ను వెనక్కి తీసుకోవాలని, వెనక్కి తీసుకొని వర్గీకరణను ఆపేయాలని కోరుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎడ్ల రాజు, సమితి కన్వీనర్ మీసాల సత్యం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుధాకర్ తదితరులున్నారు.

బాన్సువాడ : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గురువారం మాల మహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బాన్సువాడలో రాస్తారోకో నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు మేకల సాయిలు, సభ్యులు వెంకటేష్, ప్రశాంత్ తదితరులున్నారు.

హైదరాబాద్‌కు తరలిరావాలి



కామారెడ్డి రూరల్ : మాదిగలు మేలుకోకపోతే నష్టపోయే అవకాశం ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బట్టు వెంకట్ రాములు అన్నారు. ఢిల్లీ నుంచి మందకృష్ణ మాదిగ ఈనెల 13న హైదరాబాద్‌కు రానున్న సందర్భంగా ఆయనకు స్వాగతం భారీఎత్తున తరలి రావాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మహిళా అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మి ఆధ్వర్యంలో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యాదగిరి, ఎస్‌ఎస్పీ జిల్లా నాయకుడు పురుషోత్తం తదితరులున్నారు.

ఏజెన్సీని మార్చేయండి..



మాచారెడ్డి : నాణ్యమైన భోజనం వడ్డించని ఏజెన్సీని వెంటనే మార్చాలని మాచారెడ్డి విద్యాధికారి ఎల్లయ్య సూచించారు. బుధవారం మధ్యాహ్న భోజనం తిన లేం శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎంఈవో ఎల్లయ్య, చుక్కాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవేందర్ రావు గురువారం ఘన్‌పూర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అందరూ సమాలోచనలు చేసి ఏజెన్సీ ఉంచాలా.. తొలగించాలా.. అనే విషయాన్ని తీర్మానించాలన్నారు. ఆహారంలో పురుగులు వస్తే క్రిమినల్ కేసులు పెడ్తామన్నారు.

నేడు పంచాయతీ రాజ్ ప్రత్యేక కార్యదర్శి పర్యటన

భిక్కనూరు : మండలంలో శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి షఫీవుల్లా పర్యటించనున్నట్లు ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భిక్కనూరు, లక్ష్మీదేవునిపల్లి, జంగంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించనున్నారన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రచ్చ శివకాంత్ బదిలీపై వెళ్లడంతో ఆయనకు మంగళవారం పాఠశాలలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సందీప్, గంగారాం, విజయ్ పాల్గొన్నారు.

కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు



ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూలో కూర్చున్న రోగులు

- విషజ్వరాలతో రోగుల అవస్థలు
- అప్రమత్తమైన వైద్యశాఖ
- తండాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో వైరల్ ఫీవర్లతో ఆస్పత్రులు కిక్కిరిసి పోతున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా చిన్నారులతో పాటు పెద్దలు సైతం వైరల్ ఫీవర్ బారిన పడి ఇబ్బందులు పాలవుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల కారణంగా ఆస్పత్రిలోని వార్డులో రోగులతో నిండిపోతున్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గత నెలలో వంద మంది కూడా దాటని ఓపీ పేషెంట్లు గత వారం రోజులుగా 300 మంది పైబడి ఓపీ పేషెంట్లు వస్తుండగా వీరిలో 20 శాతం వరకు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత లేక..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోక పోవడంతో పాటు, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం, బయట ఆహారం సేవించడం వలన జ్వరాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు సూచిస్తున్నారు.

రాజంపేట : మండలంలోని శేర్‌శంకర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో డెంగీ కేసు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో వెంటనే అప్రమత్తమైన వైద్యాధికారులు గురువారం తండాలో ఎర్రపహాడ్ ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు వినయ్, రాజశేఖర్ తెలిపారు. అపరిశుభ్రంగా ఉంటే జ్వరంతోపాటు డెంగీ, మలేరియా వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు.

లక్ష్మీరావులపల్లిలో ఇద్దరికి డెంగీ



లక్ష్మీరావులపల్లిలో దోమల నివారణ మందును పిచికారి చేస్తున్న సిబ్బంది

మాచారెడ్డి : మండలంలోని ఆయా గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మంచం పట్టిన భవానీపేట తండా అన్న శీర్షికణ 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్య సిబ్బంది స్పందించి అక్కడ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలో లక్ష్మి అనే యువతితో పాటు భవ్యాంత్ అనే ఏడాదిన్నర బాలుడికి డెంగీ సోకగా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు భవానీపేట తండాలో వైద్య శిబిరంతో పాటు లక్ష్మీరావులపల్లి గ్రామంలో యాంటీలార్వ మందులను పిచికారి చేస్తు ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఆదర్శ్ మాట్లాడుతు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

మూడురోజులుగా జ్వరం..



మూడు రోజులుగా జ్వరం తక్కువ కాక పోవడంతో ఆస్పత్రిలో చేరాను. రెండు రోజుల నుంచి సెలైన్ ఎక్కిస్తున్నారు. ప్రస్తుతం జ్వరం కొంత తగ్గుముఖం పట్టింది.

– కోమిలి, భిక్కనూరు

రోగులు పెరిగారు..



వైరల్ ఫీవర్‌తో పాటు మలేరియా, టైఫా యిడ్ జ్వరాలు వస్తున్నాయి. వీరితో పాటు వాంతులు, విరోచనాల రోగులు ఎక్కువగా వస్తున్నారు. రోగులతో పాటు సాధారణ ప్రజలు వైరల్ ఫీవర్ సోకకుండా కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– శ్రవణ్‌కుమార్, వైద్యుడు,ప్రభుత్వ ఆస్పత్రి, ఎల్లారెడ్డి

అప్రమత్తంగా ఉండాలి



వర్షాల కారణంగా నీటి నిల్వలతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉం ది. గ్రామాలలో ఇప్పటికే అందరిని సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాం. ముఖ్యంగా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి.

– అర్జుమాన్ నజీర, మెడికల్ ఆఫీసర్ ఎర్ర పహాడ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గాంధారి(ఎల్లారెడ్డి) : ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను నివారించాలని కామారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. మొదట గ్రామ పంచాయితీ కార్యాలయంలో మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి వీధులను పరిశీలించారు. వైద్య,ఆరోగ్య శాఖ చేస్తున్న జ్వరసర్వేను పరిశీలించారు. స్థానిక ఏకలవ్య గురుకుల పాఠశాలలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బావయ్య, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ రవి, జీపీ కార్యదర్శి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికాలో కాంగ్రెస్ సమావేశానికి ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి : అమెరికాలోని టెక్సాస్ నగరంలో నిర్వహించిన తెలంగాణ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరయ్యారు. కాంగ్రెస్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబులతో పాటు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

సరిహద్దులో నిఘా పటిష్టంగా ఉండాలి



మద్నూర్(జుక్కల్) : రాష్ట్ర సరిహద్దులో ఎక్సైజ్ అధికారుల నిఘా పటిష్టంగా ఉండాలని ఎక్సైజ్ ఇన్‌చార్జి ఈఎస్ హన్మంత్‌రావ్ ఆదేశించారు. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద సరిహద్దులో ఎక్సైజ్ చెక్‌పోస్టును గురువారం ఎక్సైజ్ ఇన్‌చార్జి ఈఎస్ హన్మంత్ రావ్ తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వస్తున్న వాహనాలను ఆయన తనిఖీలు చేపట్టారు.మద్యం, మత్తు పదార్థాలు రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెక్‌పోస్ట్ సీఐ జావిద్, బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగేశ్, సిబ్బంది ఉన్నారు.

మలేషియాలో యువకుడికి అగచాట్లు

- ఏజెంట్ల మోసానికి గురైన అక్కపూర్‌వాసి
- హైకమిషన్ ఆఫ్ ఇండియా చొరవతో తిరిగి ఇంటికొచ్చిన బాధితుడు

మాచారెడ్డి : ఏజెంట్ల మోసంతో మలేషియా వెళ్లిన యువకుడు అక్కడ నానా అగచాట్లు పడిన అనంతరం హై కమిషన్ ఆఫ్ ఇండియా చొరవతో బయట పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన గడ్డం మహేశ్ 2022 జనవరిలో బతుకు దెరువు కోసం విదేశాలకు వెళదామని తెలిసిన వ్యక్తుల ద్వారా ఏజెంట్లు లక్ష్మణ్, దుర్గాప్రసాద్‌లను సంప్రదించాడు. కాగా ఏజెంట్లు మలేషియా కు వీసా ఇస్తామని, అక్కడ రోజుకు 10 గంటల డ్యూటీ, ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ కంపెనీలో పని కల్పిస్తామని నమ్మించారు. దీంతో మహేశ్ వారికి రూ.1.20 లక్షలు చెల్లించాడు. అయితే ఏజెంట్లు మహేశ్‌కు టూరిస్ట్ వీసా ఇచ్చి 2022 మే2న మలేషియాకు పంపించారు. మలేషియాలో ఫ్లైట్ దిగాక మహేశ్ ను లక్ష్మణ్, అమీన్ అనే వ్యక్తులు తీసుకెళ్లి ఓ కంపెనీలో పనికి పెట్టించారు. రెండు నెలల 15 రోజులు పని చేసినప్పటికీ కంపెనీ యాజమాన్యం జీతం డబ్బులు ఇవ్వకుండా వేధిస్తుంటే మహేశ్ మలేషియాలోని హై కమిషన్ ఆఫ్ ఇండియాను ఆశ్రయించారు. హై కమిషన్ ఆఫ్ ఇండియా అధికారులు 2023 మే 27న మహేశ్ ను మలేషియా నుంచి ఇండియాకు తిరిగి పంపించారు. తనను మోసం చేసిన ఏజెంట్ లక్ష్మణ్, రాఘవపురం దుర్గాప్రసాద్, అమీన్ లపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నాగిరెడ్డిపేటలో కలెక్టర్ సుడిగాలి పర్యటన





వన సేవకుడు రామయ్యను సత్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్‌కు రాఖీ కడుతున్న మహిళ

- హైస్కూల్, పీహెచ్‌సీ తనిఖీ
- సమస్యలు వివరించిన కళాశాల విద్యార్థులు

నాగిరెడ్డిపేట: మండలంలో గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సుడిగాలి పర్యటన చేపట్టారు. ముందుగా మాల్తుమ్మెద రైతువేదిక వద్దనున్న క్రీడా ప్రాంగణంలో మొక్కలు నాటారు. అధికారులతో మాట్లాడి బృహత్ పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కల వివరాలను తెలుసుకున్నారు. బృహత్ పల్లె ప్రకృతివనంలో మొక్కల ఎదుగుదలకు కృషి చేసిన వనసేవక్ రామయ్యను కలెక్టర్ సన్మానించారు. మహిళా సంఘాల సభ్యులు కలెక్టర్‌కు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. మాల్తుమ్మెద శివారులోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన కలెక్టర్.. అక్కడ మొక్కలు నాటి, రాశి వనాన్ని పరిశీలించారు. రాశివనంలోని మొక్కల వివరాలను ఏరువాక కేంద్రం అధికారి అనిల్‌రెడ్డి వివరించారు. అనంతరం కలెక్టర్ కళాశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. గోపాల్‌పేట హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటి పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. వేసవి సెలవులకు ముందు, ప్రస్తుతం పాఠశాలలో మారిన పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. జూనియర్ కళాశాలలోని సమస్యలను విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. లెక్చరర్లను నియమించి పాఠాలు జరిగేలా చూడాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టర్ నాగిరెడ్డిపేట పీహెచ్‌సీని సందర్శించి, ఆస్పత్రిలోని గదులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఏవో భాగ్యలక్ష్మి, డీపీవో శ్రీనివాస్‌రావు, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, డీఎల్‌పీవో సురేందర్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో తదితరులున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామాల్లోని నిరుపేద మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలోని మిల్లెట్‌మిల్లును ఆయన పరిశీలించారు. మిల్లెట్‌మిల్లులో తయారు చేస్తున్న మిల్లెట్స్ వివరాలను ఐకేపీ సిబ్బందిని అడిగి ఆయన తెలుసుకున్నారు. దీంతోపాటు మండల కేంద్రం గోపాల్‌పేటలోని గ్రామసంఘం ద్వారా రుణం తీసుకొని నిర్వహిస్తున్న దుస్తుల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 2024-25ఆర్థిక సంవత్సరంలో విధించిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల లక్ష్యాలను పూర్తి చేసేందుకు తగుచర్యలు చేపట్టాలన్నారు. డీపీఎం రమేష్‌బాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సీసీలు నారాయణ, దత్తు, రమేశ్ ఉన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి రూరల్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. పీపుల్ ఫర్ ఇండియా అగ్రిటెక్ సిరీస్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రైతులకు రామారెడ్డి రోడ్డు గర్గుల్ శివారులో పీఎఫ్ఐ డెవలప్‌మెంట్ సెంటర్లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతుకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు శ్రీనివాస్, నరేందర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆనంద్‌రావు, గంగారెడ్డి, చారి, బాల్‌రాజ్, నక్కరాజు, శ్రీనివాస్, రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం



మాచారెడ్డి : మాచారెడ్డి మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగుల అంతయ్య, ప్రధాన కార్యదర్శిగా రూప్ సింగ్, అసోసియేట్ అధ్యక్షుడుగా జగడం శ్రీనివాస్, కార్యదర్శిగా ప్రశాంత్, ఉపాధ్యక్షులుగాశ్రీహరి,రాజ్యలక్ష్మి,శైలజ ఎన్నికయ్యారు.

కొవ్వొత్తులతో ఆటో డ్రైవర్ల ర్యాలీ



భిక్కనూరు : మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు గురువారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న రామేశ్వర్‌పల్లి వాసి ఆటో డ్రైవర్ తుమ్మ శ్రీధర్ ఆటో ఈఎంఐలు కట్టలేక ఆత్మహత్య చేసుకున్నాడని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీధర్ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం ప్రతినిధులు బసగల్ల సిద్దరాములు, తాళ్ల నాగులు ఉన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

కరెంట్‌షాక్‌తో వ్యక్తి ..



గోపాల్ మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): కరెంట్‌షాక్‌తో గోపాల్(30) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన చద్మల్ తండాలో చోటు చేసుకుంది.వివరాలు..తండాకు చెందిన గోపాల్(30) బుధవారం రాత్రి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఉదయం పలుచోట్ల గాలించారు. చద్మల్ తండా-బీర్మల్ తండా మధ్య ఉన్న సోయాబీన్ పంట పొలంలో గోపాల్ విగతజీవిగా పడి ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దగ్గరకు వెళ్లి చూడగా పొలాల్లో అమర్చిన కరెంటు తీగలకు తగిలి షాక్‌తో మృతి చెందినట్లు గుర్తించారు. ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు. మృతుడి భార్య మాలోత్ షాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురికికాలువలో పడి ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఖలీల్ వాడి: నగరంలోని మూడో పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణ మందిరం వెనుక ఉన్న పెద్ద మురికి కాలువలో పడి వడ్ల రమేశ్(49) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. వివరాలు.. ధర్పల్లి మండలంలోని దుబ్బాకకు చెందిన వడ్ల రమేష్(49) నగరంలోని బైపాస్ రోడ్డులో లారీ మెకానిక్‌గా పని చేస్తున్నారు. మురికి కాలువలో రమేశ్ పడి ఉండటాన్ని రమేశ్ కుటుంబసభ్యులకు పరిచయస్తుడైన ఎండీ హనీఫ్ గురువారం గమనించారు. వెంటనే ఆయన భార్య మేఘమాలకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 5న దుబ్బాక వెళ్లారని, అప్పటి నుంచి ఫోన్ చేసినా రమేశ్ స్పందించలేదని మృతుడి భార్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మరొకరు..

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన తుమ్మ శ్రీధర్(38) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. శ్రీధర్ కొంతకాలంగా భిక్కనూరులో నివాసం ఉంటున్నాడు. బీడీ కార్మికుడిగా, ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అప్పుల బాధతో ఈనెల 1న గడ్డిమందు తాగాడు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించాడు. మృతుడి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై వివరించారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు



గాయపడ్డ బాలుడు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని 24వ వార్డు హనుమాన్ టేకిడీ కాలనీలో మూడున్నరేళ్ల బాలుడిపై కుక్కదాడి చేసింది. ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో కుక్క కరవడంతో బాలుడు అరిచాడు. గమనించిన స్థానికులు కుక్కను అక్కడి నుంచి తరిమేశారు. కుక్క దాడిలో బాలుడి చెంపపై గాయాలయ్యాయి. బాలుడిని స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని తగిన చర్యలు చేపట్టాలని బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వార్డు కౌన్సిలర్ గాండ్ల సుధారాణి అన్నారు. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు జునైద్ కోరారు.

ఆలయంలో చోరీ

ధర్పల్లి: రామడుగులోని వేంకటేశ్వర ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. గురువారం ఉదయం ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ పూజ చేయడానికి వెళ్లగా గర్భగుడి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న స్వామివారి వెండి కిరీటం, వెండి ఆభరణాలు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని ఎస్సై విక్రమ్ పరిశీలించారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కన్న కొడుకే కాలయముడయ్యాడు

- బైక్ కొనివ్వలేదని కట్టెతో తండ్రిని కొట్టి చంపిన కుమారుడు
- మద్నూర్‌లో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

మద్నూర్(జుక్కల్): ఒక్కగానొక్క కొడుకే తండ్రి పాలిట కాలయముడయ్యాడు. బైక్ కొనివ్వలేదనే కారణంతో నార్లవార్ అర్జున్(64)ను ఆయన కొడుకు కొట్టి చంపాడు. ఈ ఘటన మద్నూర్ మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బిచ్కుంద సీఐ నరేష్, ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాలు.. మద్నూర్‌కు చెందిన నార్లవార్ ఎల్లవ్వ, అర్జున్‌కు కుమారుడు వెంకట్ ఉన్నాడు. రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి తల్లి, తండ్రి ఒకచోట, కుమారుడు మరో చోట నివాసం ఉంటున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో పాటు రూ.2 లక్షల అప్పు ఉండడంతో వారికి ఉన్న భూమిని ఇటీవల తండ్రి అర్జున్ విక్రయించాడు. భూమి అమ్మగా రూ.6 లక్షలు వచ్చాయి. అందులోంచి రూ.2 లక్షల అప్పు తీర్చేయగా మిగిలిన రూ. 4 లక్షలు అర్జున్ తన బ్యాంక్ అకౌంట్‌లో దాచుకున్నాడు. వారం క్రితం ఎల్లవ్వ, అర్జున్‌లు మద్నూర్‌కు వచ్చారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి వచ్చిన వెంకట్, బైక్ కోసం డబ్బులు ఇవ్వాలని తండ్రితో గొడవ పడ్డాడు. తండ్రి డబ్బులివ్వడానికి ఒప్పుకోకపోవడంతో పక్కనే ఉన్న కట్టెతో తలపై కొట్టాడు. దీంతో అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పక్క గదిలో ఉన్న తల్లి ఎల్లవ్వ వచ్చి అడ్డుకోవడంతో ఆమెను కూడా కొట్టాడు.



నార్లవార్ అర్జున్(ఫైల్)

ఉదయం లేవకపోవడంతో..

రాత్రి జరిగిన గొడవలో అర్జున్ తలకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. ఆస్పత్రికి వెళ్లాలని అర్జున్‌కు ఆయన భార్య ఎల్లవ్వ సూచించినా ఏం కాలేదంటూ తలకు టవల్ కట్టుకొని పడుకున్నాడు. గురువారం ఉదయం ఎంతకీ అర్జున్ లేవకపోవడంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు వెంకట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేశ్ చెప్పారు.

పోక్సో కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు శిక్ష

లింగంపేట(ఎల్లారెడ్డి): పోక్సో కేసులో నేరస్తుడికి కామారెడ్డి మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ సింధుశర్మ వెల్లడించారు. వివరాలు.. లింగంపేట మండలానికి చెందిన 8 ఏళ్ల బాలిక 2018, జూలై 7న ఇంటి బయట ఆడుకుంటుండగా శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన ఎల్లనురం గుడ్డేల రాములు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు 2018 జూలై 8న లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి సీఐ సుధాకర్, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, అదనపు ప్రాసిక్యూటర్ శేషు, ప్రస్తుత సీఐ రవీంద్రనాయక్, ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి, ఎస్ఐటీ మురళి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ మనోహర్‌రావు, కిరణ్‌గౌడ్‌లను ఎస్పీ అభినందించారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: గొల్లగుట్ట తండాకు చెందిన రాజు(30) చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ గురువారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు.. గొల్లగుట్ట తండాకు చెందిన రాజు ఈ నెల 6న రాత్రి 8 గంటలకు తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవపడ్డాడు. వారు డబ్బులు ఇవ్వకపోవడంతో దుర్భాషలాడుతూ నేను చనిపోతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం 10 గంటలకు గ్రామ చెరువులో రాజు మృతదేహం స్థానికులకు కనిపించగా వారు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. రాజు భార్య సంయుక్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.